సాక్షి హనుమకొండ

మంగళవారం । 2 । మే । 2023



సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

విద్యుత్ సంస్థలు కష్టాల్లో ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇంజనీర్లుగా మనపై ఉందని ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీసీరెడ్డి అన్నారు. - 8లో▸



సమీకృత చేపల పెంపకం చేపట్టాలి

వ్యవసాయానికి అనుబంధంగా రైతులు సమీకృత చేపల పెంపకం చేపట్టాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.5^0 /24.0^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు పలు చోట్ల వర్షం కురుస్తుంది.

కన్నీటిధారలు!

కల్లాల్లో ధాన్యం, కొనుగోలు కేంద్రాల్లో జాప్యం

- అకాల వర్షాలకు ధాన్యమంతా నేలపాలు
- వరుస నష్టాలతో ఆందోళనలో రైతులు
- ఈ యాసంగిలో 1.12 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 2.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- 164 కేంద్రాలకు 58 చోట్లనే కొనుగోళ్లు...



ఈ ఫొటోలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్నది కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన రైతు జీరకుంట్ల చంద్రయ్య దంపతులు. చంద్రయ్య తనకు పండిన ధాన్యాన్ని విక్రయించేందుకు కమలాపూర్ మార్కెట్‌కు తరలించాడు. సకాలంలో కొనుగోలు చేయలేదు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసి మొత్తం కొట్టుకుపోయింది.

సాక్షిప్రతినిధి, వరంగల్: యాసంగి పంటలు వేసిన రైతులకు మొదటినుంచీ ఇబ్బందులు తప్పడం లేదు. పొలం దున్ని నాటు వేసింది మొదలు... వరికోతలు చేపట్టి ధాన్యం విక్రయించే వరకు అన్నీ కష్టాలే. ఆరుగాలం శ్రమించిన రైతులను పంట చేతికందుతుందన్న సమయంలో అకాల వర్షాలు నిండాముంచాయి. జిల్లాలో ఈ ఏడాది వరిపంటను అధిక సంఖ్యలో సాగుచేశారు. కోత దశలో వడగళ్లు, అకాల వర్షాలతో వడ్లన్నీ పొలంలోనే రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి, కొట్టుకుపోయింది. మరో మూడు రోజులు వర్షాలు పొంచి ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరిక రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వరుస వర్షాలతో జిల్లాలో 24,802 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. కానీ నష్టం చాలా ఎక్కువగా ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి తెలుస్తోంది.

ఊపందుకోని కొనుగోళ్లు... తడుస్తున్న ధాన్యం...

హనుమకొండ జిల్లాలో ఈ యాసంగి సాగును దృష్టిలో పెట్టుకుని 2.50 లక్షల మె.టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐకేపీ, ప్యాక్స్‌ల ద్వారా 164 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సన్నాహాలు చేసిన పౌరసరఫరాలశాఖ 107 కేంద్రాలను ప్రారంభించింది. 17 ఐకేపీ, 41 ప్యాక్స్ కేంద్రాలు కలిపి మొత్తం 58 చోట్లనే కొనుగోళ్లు చేస్తుంది. జిల్లాలో 74,075 ఎకరాల వరి సాగు అంచనా కాగా, 1,12,456 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. రైతులు పంట కోయడంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి, ఆరబెడుతున్నారు. తేమ పేరిట అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో పొలం నుంచి తరలించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ఆరబోస్తున్నారు. అకస్మాత్తుగా కురుస్తున్న వానల వల్ల ధాన్యం తడిసి ముద్దవుతోంది.

కొనుగోలు చేసింది 8,271 మె.టన్నులు

ఈ యాసంగిలో 2.50 లక్షల మె.టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, సోమవారం సోమవారం నాటికి జిల్లాలో 1,256 మంది రైతుల నుంచి రూ.17.20 కోట్ల విలువ చేసే 8,271 మె.టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 8,245 మె.టన్నుల ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద రైసుమిల్లులకు ధాన్యం తరలించారు. వారం రోజులుగా వాతావరణంలో మార్పు కారణంగా ధాన్యంలో తేమశాతం రాకపోవడంతో కొనుగోళ్లు చేపట్టడం లేదు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా వారం రోజులనుంచి అకాలవర్షాలు కురుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వందలాది మంది రైతుల ధాన్యం తడిసిపోయింది. కొందరు రైతులు అదే ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టి విక్రయిస్తున్నారు. ధాన్యాన్ని కుప్పలుగా పోయడంతో మొలకలు వస్తున్నాయి. వడగళ్ల వర్షం కురిసిన రోజు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. కానీ ఎక్కడా తడిచిన ధాన్యం కొనుగోలు చేయడం లేదు.



వాన ఈసారి అరిగోస పెడ్తంది..

నాలుగు రోజులైతే పంట అమ్ముకునేటోళ్లం.. వాన ఈసారి అరిగోస పెడ్తంది.. మొన్నటి వానతో 25 శాతం పంట పొలంలోనే రాలింది. మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. మొన్నటి వర్షానికి ధాన్యం తడిసిపోయింది. తిరిగి ఆరబెట్టాను. ఆదివారం రాత్రి వానకు మళ్ల తడిసి కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కుప్పగా పోగు చేసుకుంటున్నా.

- జీరకుంట్ల చంద్రకళ, మహిళా రైతు, గూడూరు

పెట్టుబడులు నష్టపోయిన



నాకున్న మూడున్నర ఎకరాలకు తోడు మరో ఎకరంన్నర పొలం కౌలుకు తీసుకొని వరి పంటేసిన. మరో 4 ఎకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్న. వరికి రూ.1.40 లక్షలు, మామిడికి రూ.2.20 లక్షలు పెట్టుబడి పెట్టిన. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వరి పంటంతా నేలవాలి నీట మునిగి మొలకలు వస్తుండగా, మామిడి కాయంతా రాలి పోయి లాభం దేవుడెరుగు.. పెట్టుబడులు సైతం నష్టపోయిన.

- బండి కుమారస్వామి, రైతు, కమలాపూర్







మడికొండ శివారులో కొట్టుపోయిన వరి ధాన్యం, కమలాపూర్ మార్కెట్‌లో ఆరబోయగా అకాల వర్షానికి తడిసి కొట్టుకుపోయిన వరి ధాన్యం

రెడ్డిపురం వద్ద కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఏరుతున్న రైతు

న్యూస్‌రీల్

కేజీబీవీ టీచర్లకు వేసవి సెలవులు ఇవ్వాలి : డీటీఎఫ్

విద్యారణ్యపురి: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ)లో పనిచేస్తున్న టీచర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ టీచర్లు ప్రతిరోజూ విధులకు హాజరుకావాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు అధికారి ఆదేశాలు జారీచేయడం సరికాదని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్



వరంగల్ స్పోర్ట్స్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత నెల 29, 30వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలను సాధించారని కోచ్ సిరిగిరి తిరుపతి తెలిపారు. పతకాలు సాధించిన వారిలో హనుమకొండ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు అఖిల (63కేజీలు), హరిప్రియ(45 కేజీలు), టి.రికితా (52కేజీలు), ఎం.సంతోషి(42కేజీలు), వి.రోహిణ(65కేజీలు) బంగారు పతకాలను సాధించినట్లు వివరించారు. పురుషుల విభాగంలో పి.సాకేత్‌రాజ్ (95 కేజీలు), బి.అరుణ్ (83కేజీలు), విజయ్ కుమార్ (63కేజీలు) బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వీరందరూ జూలై 1నుంచి 5వ తేదీ వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే వాకో ఇండియా జాతీయ స్థాయి సీనియర్స్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పతకాలను సాధించిన క్రీడాకారులను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డైరెక్టర్ ఎం.బలరాం, జి.సంతోష్‌కుమార్, నాగిరెడ్డి, హనుమకొండ జిల్లా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ బి.సంతోష్‌లు అభినందించారు.

డిపాజిట్ లేకుండా అద్దెకు ఆర్టీసీ బస్సులు

హన్మకొండ: వివాహాది శుభకార్యాలకు ముందస్తు డిపాజిట్ లేకుండా అద్దెకు ఆర్టీసీ బస్సులు ఇస్తున్నట్లు వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో కొత్త సొమ్మును తీసుకునే వారమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలాంటి డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీపై సులభతర పద్ధతిలో బస్సును అద్దెకు ఇస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9959226047, 7382852558, 7382855793 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

4 నుంచి స్లాట్ బుకింగ్

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని దివ్యాంగులకు మే నెలలో నిర్వహించే సదరం క్యాంపుల్లో పాల్గొనేందుకు ఈనెల 4వ తేదీ ఉదయం 11.30 నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌లు అందుబాటులో ఉంటాయని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంజీఎం అధికారులు సోమవారం షెడ్యూల్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆర్థోపెడిక్, అంధత్వ, మానసిక, వినికిడి లోపం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంట్రోల్ రూం ప్రారంభం

హన్మకొండ అర్బన్: ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సోమవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లులకు చేరే వరకు ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచులు, కొనుగోళ్ల ప్రక్రియ మానిటరింగ్, తదితర సమస్యల పరిష్కారానికి 81437 39243నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీసీఎస్ డెలిగేట్స్ నిరసన

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే సీసీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం సీసీఎస్ డెలిగేట్స్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీసీఎస్ డెలిగేట్స్ పాక వేదప్రకాష్, వి.భిక్షపతి, డి.రాఘవేందర్, బి.శ్రీనివాస్, బి.ధన్‌రాజ్ మాట్లాడుతూ సీసీఎస్ కార్యాలయంలో జరిగిన ఫోర్జరీ సంతకాలు, అవకతవకలపై ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసి బదిలీ చేసిన విషయంలో మొదటగా తప్పు చేసిన డైరెక్టర్‌ను వదిలి ఇద్దరిపై చర్యలు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమార్కులను గుర్తించి సీసీఎస్ సొసైటీని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టు పాలనలో ప్రజలకు భద్రత

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, వీరయ్య



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

ఖిలా వరంగల్: కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా పుట్టిందని, కమ్యూనిస్టుల పాలనలో ప్రజలు భద్రతగా ఉంటారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, వీరయ్య అన్నారు. మే డే సందర్భంగా సోమవారం రాత్రి వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కార్యదర్శి రంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మేడేను కార్మికులు ఘనంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో విసిగి వేశారిన ప్రజలు బీజేపీకి ఓటు వేసి వేశారని, ఎనిమిది ఏళ్లు గడిచినా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. మోదీ ప్రభుత్వం రాకముందు గ్యాస్‌ధర రూ.412 ఉంటే ప్రస్తుతం రూ.1,250 అయ్యిందని, పెట్రోల్ ధర, డీజిల్ ధరలు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని మండిపడ్డారు. భారత సంపద, ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని వారు విమర్శించారు. సమావేశంలో నాయకులు బాబు, నలుగంటి రత్నమాల, సాగర్, ఆకినపల్లి యాదగిరి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు 34 ఫిర్యాదులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌కు 34 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వింగ్ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు 13, పన్నుల విభాగం– 03 ఇంజనీరింగ్ – 06 , పబ్లిక్ హెల్త్ –శానిటేషన్ – 08, టర్ సప్లయ్‌కి – 02, ఉద్యానవన – 1, డీఆర్ఎఫ్‌కు 01 అందాయి. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతుల్లో జాప్యం చేయొద్దు

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై స్వీకరించిన వినతులను జాప్యం చేయకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు కలెక్టర్ హాజరై ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రజలు ఎంతోశ్రమకోర్చి ప్రజావాణికి వస్తున్నారన్నారు. వారినుంచి తీసుకున్న దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో ఎంజీఎం ఆస్పత్రి 06, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 04, హనుమకొండ తహసీల్దార్ 03, కలెక్టరేట్ డీ సెక్షన్ 03లతోపాటు మొత్తం 44 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీపీఓ జగదీశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవిలత, మార్కెటింగ్ అధికారి సురేఖ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్
- ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రమేష్, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు

ఐనవోలు: పురాతన స్వయంభూ శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ హామీ ఇచ్చారు. మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మినరసింహ స్వామి ఆలయంలో సోమవారంనుంచి అధ్యయన ఉత్సవం, పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. చైర్మన్‌గా పబ్బతి సత్యనారాయణ, సభ్యులుగా తాడెం మోహన్, అరూరి వకుళ, నిమ్మాని వేంకటేశ్వర్లు, కాటబోయిన కుమారస్వామిలను నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి ప్రహరి నిర్మాణం, అర్చకుడి వసతి, భృతి ఏర్పాటు చేయిస్తానని హామీఇచ్చారు. గ్రామస్తులు ఆరు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఐనవోలు ఆలయ చైర్మన్ మజ్జిగ జైపాల్, సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉప సర్పంచ్ బొల్లం ప్రకాశ్, రైతుబంధు కో ఆర్డినేటర్ పడిదల సమ్మారావు, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్ పాల్గొన్నారు.

పంటల నష్టంపై నివేదికివ్వండి

కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- కౌలురైతులకు మేలు జరిగేలా చర్యలు
- ధాన్యం సత్వర కొనుగోళ్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మంత్రి కేటీఆర్ టూర్ షెడ్యూల్ విడుదల



సమీక్షలో పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వెంటనే నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. అధికారులను ఆదేశించారు. పంటనష్టం అంచనా విషయంలో కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతులకు ధైర్యం, భరోసా కల్పించాలని సూచించారు. అకాల వర్షాలు, పంటల నష్టాలు, ధాన్యం కొనుగోళ్లపై వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులతో సోమవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి దయాకర్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటల నష్టాలను వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. కౌలురైతులతోపాటు, నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఆలస్యం జరగకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని తెలిపారు. రైతుల పంటలను ఆఖరు గింజ వరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, రైస్‌మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి, కాంటాల్లో కోతలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం రవాణాను సైతం వేగంగా చేపట్టాలని, సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని రైతులకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. మక్కల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని దయాకర్‌రావు సూచించారు. సమావేశంలో వర్ధన్నపేట, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, వ్యవసాయాధికారి ఉషాదయాళ్, డీఆర్‌డీఓలు శ్రీనివాస్ కుమార్, సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటనపై సమీక్ష..

రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా చేపట్టనున్న ఏర్పాట్లపై సోమవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వొడితెల సతీష్‌కుమార్, మేయర్ గుండు సుధారాణి అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్షించారు. ఈనెల 5న వరంగల్ పర్యటనకు రానున్నారని, ఈ సందర్భంగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్న దయాకర్‌రావు షెడ్యూల్ ప్రకటించారు.

- ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు.
- మధ్యాహ్నం.3 గంటలకు హసన్‌పర్తి(ఎర్రగట్టు గుట్ట) కిట్స్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని.. ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్ తిలకిస్తారు. అనంతరం హెచ్ఓడీలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొంటారు.
- సాయంత్రం4 గంటలకు హసన్‌పర్తి బాలాజీ గార్డెన్స్‌లో కేసీఆర్ కప్ బహూకరణ కార్యక్రమం
- 4.30 గంటలకు హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం.
- 5.30 గంటలకు హంటర్ రోడ్‌లోని సైన్స్ సెంటర్, 5.50 గంటలకు లష్కర్ బజార్ మర్కజీ స్కూల్లో నగరంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు.
- 6.15 గంటలకు గాంధీనగర్‌లో(అంబేడ్కర్ భవన్, టీవీ టవర్ దగ్గర) మోడల్ వైకుంఠ ధామం ప్రారంభోత్సవం చేస్తారు.
- 6.45 గంటలకు సెయింట్ గాబ్రియల్ స్కూల్లో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

శిబిరాల దరఖాస్తుల గడువు పొడిగించండి : కలెక్టర్

వరంగల్ స్పోర్ట్స్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందేందుకు దరఖాస్తులకు మరో మూడు రోజుల గడువు ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ .. డీవైఎస్ఓ అశోక్‌కుమార్‌కు మౌఖికంగా సూచించారు. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం సాయంత్రం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేసవి సెలవులను వృథా చేయకుండా అభిరుచి గల అంశాల్లో శిక్షణ పొందాలని పిల్లలకు సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీపీఓ జగదీష్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యుడు జగన్మోహన్‌రావు, శ్యామల పవన్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



బాక్సింగ్ స్పారింగ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

రూ.150కోట్ల అభివృద్ధి పనులకు కేటీఆర్ శంకుస్థాపన

ప్రభుత్వ చీఫ్‌విఫ్ వినయ్‌భాస్కర్ వెల్లడి

కాజీపేట రూరల్ : హనుమకొండ జిల్లాలో రూ.150 కోట్ల అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారాకరామారావు శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నగరంలోని కాజీపేట సెయింట్ గాబ్రియేల్ స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 5వ తేదీన జరిగే కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని అన్నారు. సైన్స్ పార్క్‌ను, బీదవారికి పట్టాల పంపిణీ, వైకుంఠధామాన్ని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, అధికారులు, పోలీస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లి అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల!

● రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ

గీసుకొండ: తల్లి అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంట జయశంకర్‌కాలనీకి చెందిన బండారి విక్రమ్ ఇంట్లో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి సుమారు 14 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. గత నెల 13న విక్రమ్ తల్లి చెన్నారావుపేట మండలం గురిజాలలో చనిపోయింది. దీంతో కుటుంబమంతా ఇంటికి తాళం వేసి గురిజాలకు వెళ్లింది. అనంతరం తల్లి అంత్యక్రియలు, దశదిన ఖర్మ లాంఛనాలు పూర్తి చేసుకోగా.. విక్రమ్ తన కూతురును గత నెల 30న ఇంటికి పంపించాడు. ఆమె ఇంటివద్దకు వచ్చి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో విషయాన్ని తండ్రికి ఫోన్‌లో చెప్పింది. అతడు అక్కడికెళ్లి 100కు డయల్ చేశాడు. ఇంటిలో డ్రెస్సింగ్ టేబుల్, బీరువా తాళాన్ని పగులగొట్టి అందులోని బట్టలు, పర్సులను పడేసి దొంగలు నగలు ఎత్తుకెళ్లారు. మొత్తం ఏడు రకాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఎస్‌ఐ సందీప్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని ముక్తివనం పార్కు వద్ద సోమవారం కోతులను తప్పించబోయి చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం జిల్లాలోని జంగేడు గ్రామానికి చెందిన ఓదెల రమేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరం వచ్చాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యాడు. ముక్తివనం పార్కు వద్ద కోతుల గుంపు రోడ్డుపై అడ్డు రావడంతో తప్పించబోయి కారు చెట్టును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న రమేశ్‌కు ముక్కు, ఛాతిలో గాయాలయ్యాయి. అతడి కుమార్తె శ్రీనిజ తలకు గాయమైంది. అతడి భార్య, అల్లుడు, ఇద్దరు పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో చెట్టుకు బలంగా ఢీకొట్టడంతో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో సురక్షితంగా బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అంబులెన్స్ మహదేవపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

'సాక్షి' మాక్ ఎంసెట్‌కు విశేష స్పందన

● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ ఎంసెట్‌లో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట రూరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాక్షి ఇంజనీరింగ్ మాక్ ఎంసెట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కాజీపేట సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సాక్షి మాక్ టెస్ట్ జరిగింది. విద్యార్థులను ప్రోత్సాహిస్తూ, ఒత్తిడి తగ్గించి ఎంసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించేందుకు సాక్షి నిర్వహించిన మాక్ టెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఆన్‌లైన్‌లో ఈపరీక్ష రాశారు. ఈ సందర్భంగా సాక్షి జిల్లా బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో సాక్షి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇలాంటి పరీక్షలను విద్యార్థులు ఉపయోగించుకుని వారి ప్రతిభా పాటవాలను పరీక్షించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ ఎన్.సుమన్, సాక్షి బ్యూరో ఛీఫ్ జి.రాజిరెడ్డి, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కాలేజ్ డైరెక్టర్ తాళ్ల వంశీ, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు సీనియర్ లెక్చరర్ మేథమెటిక్స్ కె.సాంబశివుడు, రాధాకృష్ణ అకాడమీ డైరెక్టర్ మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన వచ్చింది



సాక్షి నిర్వహించిన మాక్ ఎంసెట్‌తో ఒక అవగాహన వచ్చింది. పరీక్ష రాసే విధానం, అడిగిన ప్రశ్నల తీరుపై, సమయం కేటాయింపు అంశాలను తెలుసుకోగలిగా. ఆన్‌లైన్ పరీక్ష విధానంపై అవగాహనతో పాటు ఆందోళన తగ్గింది. భవిష్యత్‌లో ఎలాంటి పరీక్షలైనా సమర్థంగా రాయాలనే ధైర్యం వచ్చింది.

– ప్రజ్వల్, విద్యార్థి

ప్రశ్నల తీరు తెలిసింది..



సాక్షి నిర్వహించిన మాక్ ఎంసెట్ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నేను పరీక్ష బాగా రాశాను. మాక్ టెస్ట్‌లో ప్రశ్నలు అడిగిన తీరుపై అవగాహన వచ్చింది. సాక్షి మీడియా భవిష్యత్‌లో ఇలాంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు బాసటగా నిలువాలని కోరుకుంటున్నా.

– సుప్రియ, విద్యార్థిని

సాక్షి మాక్ టెస్ట్‌లు ఉపయోగకరం



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాక్ టెస్ట్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి మాక్ టెస్ట్‌లు మరిన్ని నిర్వహించి విద్యార్థుల భయాందోళనను తీసి వేసి ప్రోత్సాహించాలి. ఈ మాక్‌టెస్ట్ కార్యక్రమానికి మా కళాశాల వేదికైనందుకు ఆనందంగా ఉంది.

– తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్

కార్మికులకు అండగా బీఆర్‌ఎస్



బీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి దయాకర్‌రావు

● కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం
● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సంపదను సృష్టిస్తున్న కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతా పథకం, చేనేత, బీడీ కార్మికులు, గీత కార్మికులకు బీమా, సబ్సిడీలు, పాడుపు పథకం అమలు చేస్తోందన్నారు. ఆటో, ట్రాక్టర్ కార్మికులకు ట్యాక్స్‌లు రద్దు చేసిందని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడికి రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. బీజేపీ పాలిత 16 రాష్ట్రాల్లో బీడీలు చేసే కార్మికులను పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతోందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో కార్మికులు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకట నారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆర్బీఎస్ మండల కో–ఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, నియామకాలు

వరంగల్ లీగల్: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, నియామకాలు జారీ చేస్తూ హైకోర్టు అధికారిక వర్గాలు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నలుగురు జూనియర్ సివిల్ జడ్జిలు ఇతర జిల్లాలకు బదిలీ కాగా.. ఒక జడ్జికి ఇదే జిల్లాలో స్థాన చలనం జరిగింది. ఇతర జిల్లాల నుంచి ఆరుగురు జూనియర్ సివిల్ జడ్జిలను వరంగల్ ఉమ్మడి జిల్లాలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన వారిలో..

హనుమకొండ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి పి.గోపిక నాగశౌర్య ఖమ్మం పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. హనుమకొండ నాలుగో ఎంఎం కోర్టు జడ్జి మట్ట సరిత తొర్రూరు కోర్టుకు బదిలీ అయ్యారు. హనుమకొండ పీడీఎం కోర్టు జడ్జి రాపోలు అనిత సంగారెడ్డి జిల్లా సెకండ్ ఎంఎం మొబైల్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కాజీపేట రైల్వే కోర్టు జడ్జి షేక్ ఆరీఫ్ నల్గొండ జిల్లా తుంగతుర్తి కోర్టుకు బదిలీ కాగా.. జనగామ పీడీఎం కోర్టు జడ్జి డి.టి పృథ్వీరాజ్ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు బదిలీపై వస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలు

వరంగల్ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జిగా ఖమ్మం పీడీఎం కోర్టు జడ్జి ఎస్‌వీ హైమ పూజిత బదిలీపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా పీడీఎం కోర్టు జడ్జిగా ఖమ్మం ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి ఎస్.శాంతిసోని, హనుమకొండ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి పీడీఎం కోర్టు జడ్జి సీహెచ్ శ్రావణస్వాతి బదిలీపై వస్తున్నారు. హనుమకొండ థర్డ్ ఎంఎం కోర్టు జడ్జిగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పీడీఎం కోర్టు జడ్జి ప్రియాంక సిరిసిల్ల, జనగామ పీడీఎం కోర్టు జడ్జిగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పీడీఎం కోర్టు జడ్జి ఈ.సుచరిత బదిలీపై రానున్నారు. మహబూబాబాద్ పీడీఎం కోర్టు జడ్జిగా ఖమ్మం సెకండ్ ఎంఎం కోర్టు జడ్జి పి.మౌనిక బదిలీపై రానున్నారు.

సమీకృత చేపల పెంపకం చేపట్టాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

కరీమాబాద్: వ్యవసాయానికి అనుబంధంగా రైతులు సమీకృత చేపల పెంపకం చేపట్టాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, మామునూరు కేవీకే, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేపల పెంపకంలో భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని చెప్పారు. చేపల మాంసం మంచి పోషకాహారం అని చెబుతూ అందులో ఒమేగా ఫ్యాటీ ఆసిడ్స్ కూడా అధికంగా ఉంటాయన్నారు. చేపల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యం.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో చేపల పెంపకానికి అనువైన నేలలున్నాయని తెలిపారు. చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ గణేశ్, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథమున్న కవిత్వంతో చైతన్యం

● ఘనంగా 'వెలుగు రవ్వలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకృష్ణదేవరావు

హన్మకొండ కల్చరల్: సామాజిక దృక్పథం కలిగిన కవిత్వం సార్వజనీనమై ప్రజలను చైతన్య పరుస్తుందని, సాహిత్యానికి సమాజాన్ని సంస్కరించే శక్తి ఉందని నల్సార్ న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ పెండ్యాల శ్రీకృష్ణదేవరావు అన్నారు. సర్వోదయ ఆర్గనైజేషన్ సహకారంతో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, న్యాయవాది, సహృదయ సంస్థ ఉపాధ్యక్షులు మల్యాల మనోహరరావు రచించిన వచన కవితా సంపుటి 'వెలుగు రవ్వలు' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో సహృదయ సంస్థ అధ్యక్షులు మనోహరబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో ముఖ్య అతిథిగా శ్రీకృష్ణదేవరావు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ.. మల్యాల రచించిన వెలుగు రవ్వలు ప్రశ్నించే తత్వం ఉన్న పుస్తకమన్నారు. ఈసందర్భంగా వెలుగు రవ్వలు పుస్తకాన్ని కవి మల్యాల మనోహరరావు తన సతీమణికి అంకితమిచ్చారు. తన పాఠశాల గురువైన గంటా రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత మెట్టు మురళీధర్, సహృదయ ప్రధాన కార్యదర్శి ఎన్వీఎన్‌చారి, కుందావజ్ఝుల కృష్ణమూర్తి, డా.ఏవీ నరసింహారావు, రాధాకృష్ణ, కళా రాజేశ్వరరావు, నాగిళ్ల రామశాస్త్రి, పొట్లపల్లి శ్రీనివాసరావు, కాంచనపల్లి రాజేందర్, అన్వర్, సహృదయ, సర్వోదయ సభ్యులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

● తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి

హన్మకొండ: పని చేస్తున్న సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బీసీ రెడ్డి అసోసియేషన్ సభ్యులకు సూచించారు. సోమవారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సంస్థలు కష్టాల్లో ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇంజనీర్లుగా మనపై ఉందన్నారు. పీఆర్సీతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించుకున్నామని, ఇక నుంచి మరింత ఉత్సాహంతో పని చేయాలన్నారు. డిప్లొమా ఇంజనీర్స్‌కు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నరేందర్, ఎస్పీడీసీఎల్ జనరల్ సెక్రటరి తాజుద్దీన్, అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, జనగామ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, ములుగు, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శులు రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చితకబాదిన ఉపాధ్యాయుడు



తల్లిని కొడుతున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

మరిపెడ రూరల్: 'చనిపోయిన తమ్ముడి కుటుంబానికి చెందిన భూమి లాక్కొని, ఆకుటుంబానికి అన్యాయం చేస్తావారా?' అని కొడుకును నిలదీసినందుకు కోపోద్రిక్తుడైన కుమారుడు కన్నతల్లిని చితకబాదాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి సూరమ్మ–లాలయ్య (లేట్) దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి కుటుంబానికి సర్వే నంబర్ 206/ఈలో 4.18 ఎకరాల భూమి ఉంది. చిన్నకుమారుడు చెరుకుపల్లి అశోక్‌కు ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడి కుటుంబానికి 18 గుంటలు, అన్నదమ్ముల భాగం కింద మరో 10 గుంటలు.. మొత్తం 28 గుంటల భూమిని గ్రామస్తుల ఆధ్వర్యంలో రాసిచ్చారు. ఈభూమిపై కన్నేసిన పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ప్రభాకర్ 28 గుంటల భూమినంతా తన భార్య అయిన వసంత పేరిట పట్టా చేయించుకున్నాడు. ఇటీవల ఈ విషయం బయట పడగా.. తల్లి సూరమ్మ ప్రభాకర్‌ను నిలదీసింది. దీంతో కన్నతల్లి అని చూడకుండా ఉపాధ్యాయుడు ప్రభాకర్ కాలుతో తన్ని చెంపలపై కొట్టి ఈడ్చి కిందపడేశాడు. 'కష్టపడి చదివించి ప్రయోజకున్ని చేసిన. అయినా.. నన్ను ఇష్టం వచ్చినట్లు కొడుతున్నావ్' అని సూరమ్మ బోరున విలపించింది. చనిపోయిన చిన్న కొడుకు కుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాలని గ్రామస్తులను, అధికారులను ఆ తల్లి వేడుకుంటోంది. ఈవిషయంపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సూరమ్మ పేర్కొంది.

డబ్బులిప్పించాలని అర్ధనగ్న ప్రదర్శన



నిరసన తెలుపుతున్న అంజయ్య, ఐలయ్య

తరిగొప్పుల: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే బీఆర్‌ఎస్ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండల కేంద్రానికి చెందిన ఆవుల అంజయ్య, సుంకరి ఐలయ్య వాపోయారు. ఈమేరకు వారు సోమవారం తరిగొప్పుల–చేర్యాల రోడ్డుపై బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈవీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్లపల్లి పోశయ్య కుమారుడు తాళ్లపల్లి రవి అంజయ్య వద్ద రూ.4 లక్షలు, అయిలయ్య వద్ద రూ.1 లక్ష అప్పుగా తీసుకున్నాడని, తిరిగి ఇవ్వాలని అడిగితే ఐపీ పెట్టి కోర్టు ద్వారా నోటీసులు పంపించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిప్పించి న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని వారు వాపోయారు. ఈవిషయమై తాళ్లపల్లి పోశయ్యను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా స్విచ్ ఆఫ్ వచ్చింది.

మహా జాతరకు ముందస్తుగా పోలీస్‌శాఖ సిద్ధం



జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ఎస్ఎస్‌తాడ్వాయి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో పకడ్బందీ ఏర్పాట్లపై పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ఈమేరకు సోమవారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో ఎస్పీ గాష్ ఆలం జాతరలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, జాతర విజయవంతంపై పోలీసు అధికారులతో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతరకు సుమారుగా 2 కోట్ల మంది భక్తులు హాజరవుతారని జాతరలో భక్తుల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు. గత మహా జాతరలో పని చేసిన అధికారుల అనుభవాలు, లోటు పాట్లపై సమీక్షించారు. వచ్చే జాతరలో విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇంకా మెరుగైన సౌకర్యాలపై అంశాల వారీగా చర్చించారు. ప్రధాన రహదారులు భద్రత, మరమ్మతులు, భక్తుల రద్దీ నియంత్రణ, భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐ స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ, రవీందర్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, కమ్యూనికేషన్ సీఐ రోహిత్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ స్వామి, ఎస్ఐలు కర్ణాకర్‌రావు, వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, తాజుద్దీన్, రమేశ్, తాహీర్‌బాబా, పీఎస్ఐ శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

చిత్రకారుడిగా గర్విస్తున్నా..

● ఎంపీ పసునూరి దయాకర్
● డ్రాయింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



బొమ్మ గీస్తున్న ఎంపీ దయాకర్

హన్మకొండ చౌరస్తా: 'బొమ్మలు గీయడం ఓ అద్భుతమైన కళ. నేను ఒక చిత్రకారుడినని చెప్పుకోవడానికి గర్విస్తున్నా' అని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. సాగంటి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీలోని సత్యం పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డ్రాయింగ్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీఎం కేసీఆర్ తనను చిత్రకారుడిగా గుర్తించిన తర్వాతనే ఎంపీగా అవకాశం కల్పించాడన్నారు. అకాడమీ డైరెక్టర్ మంజుల మాట్లాడుతూ.. నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి 11 వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, ప్రముఖ రచయితలు మహ్మద్ సిరాజ్, బిల్లా మహేందర్, విద్యావేత్త బూర విద్యాసాగర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ విజయ్ కుమార్, ఆలేటి శ్యాం, స్కూల్ కరస్పాండెంట్ చెరుకు వేణు, దేవిక, రజిత, సంధ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



చింటు (ఫైల్)

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామానికి చెందిన గిన్నారపు చింటు (28) సోమవారం మృతి చెందాడు. చింటు దాదాపు 3 నెలల క్రితం టేకులగూడెం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నిమ్స్ ఆసుపత్రికి తరలించడానికి తోడ్పాటును అందించారు. ప్రభుత్వ ఎల్‌ఓసీని ఇప్పించి వైద్యం చేయించారు. చింటు కుటుంబ పరిస్థితి తెలిసిన గ్రామస్తులు, బంధు,మిత్రులు ఆర్థికంగా చేయూతనందించారు. ఇటీవలే కోమాలోంచి బయటకు వచ్చిన చింటు ఇంటి వద్ద ఉండి వైద్యం చేయించుకుంటున్నారు. సోమవారం తీవ్ర అస్వస్థతకు గురైన అతడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రైలు నుంచి జారి పడి ఒకరు..

జనగామ రూరల్: రైలు నుంచి జారి పడి సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై సీహెచ్.పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు టికెట్ తీసుకుని వెళ్తున్న ఓ గుర్తు తెలియని (సుమారు 35 నుంచి 45 వయసు) వ్యక్తి రఘునాథపల్లి–జనగామ రైల్వే ట్రాక్ మధ్య గల స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతుడికి చెందిన ఎలాంటి ఆధారాలు లేవని గుండ్రటి ముఖం, మెడ చేతిపై త్రిశూలం కలిగిన పచ్చబొట్టు, అతడి ఒంటిపై ఆకుపచ్చ డిజైన్ కలిగిన ఫుల్ షర్ట్, నలుపు నీలి రంగు పాయింట్, గల్లాపై మధు టైలర్ జవహర్‌నగర్ హైదరాబాద్ అని రాసి ఉంది. వివరాలకు 94906 19031, 9866 330257 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై తెలిపారు.

చేప పది కిలోలు!



కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలో సోమవారం మత్స్యకారులకు పదికిలోల చేప చిక్కింది. ఈచేపను మహదేవపూర్‌కు చెందిన బి.శేఖర్ అనే వ్యక్తి రూ.1500కు కొనుగోలు చేశాడు.